సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 11 । అక్టోబర్ । 2025



పశ్చిమలో మద్యం దందా
ఉమ్మడి పశ్చిమలో మద్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. వీధివీధికీ బెల్టుషాపులు, ఎమ్మార్పీకి మించి అధిక ధరలతో దోపిడీ కొనసాగుతోంది. 8లో ▸



ఒంటరి వృద్ధులే టార్గెట్
తణుకులో వృద్ధురాలిని భయపెట్టి 70 కాసుల బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకున్నారు. 8లో ▸



సాంకేతికతపై పట్టు సాధించాలి
విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ అన్నారు. నిట్‌లో టెక్రియా 2కే25 ప్రారంభమైంది. 8లో ▸

న్యూస్‌రీల్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉద్యోగులకు పింఛన్ మంజూరు పత్రాలు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ఉద్యోగుల చెంతకే రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ కార్యాలయం రావడం, దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించడం సంతోషమని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యంత్రాంగం రాష్ట్ర ఏజీ కార్యాలయం అధికారులతో ఏర్పాటుచేసిన జీఎఫ్, పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ, కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతిప్రియ మాట్లాడుతూ మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగుల చెంతకే వచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి నెలా ఏజీ బృందం ఆయా జిల్లాల్లో పర్యటిస్తుందని, వారి వద్ద సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పెన్షన్ అదాలత్‌లో 35 మంది ఉద్యోగులకు పింఛన్ మంజూరు పత్రాలను అందించామన్నారు. పింఛన్ సమస్యల పరిష్కారానికి 20 మంది దరఖాస్తు చేసుకోగా 15 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. జీపీఎఫ్ సమస్యలపై 55 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎస్.ఆశ్రిత పట్నాయక్ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర ఖజానా, లెక్కల అధికారి ఎస్.మోహనరావు మాట్లాడుతూ త్వరలో పెన్షన్ ప్రతిపాదనల సమర్పణలో పలు మార్పులు రానున్నాయన్నారు. ఉద్యోగి ఎప్పుడైనా జీపీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకునే విధానం రానుందన్నారు. డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, ఏజీ కార్యాలయం సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు టి.విజయ కుమార్, ఎస్.బాలాజీ, కె.లక్ష్మి విజయ దుర్గ, ఎస్.నాగ మురళి, జిల్లా ఖజానా అధికారి మహ్మద్ మల్హర్ బేగ్, జిల్లా ఆడిట్ అధికారి ఎస్.మధు బాబు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు మేలు

భీమవరం: ప్రకృతి సాగుతో పండించిన కూరగాయలను వినియోగించడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగవుతాయని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ, డీఆర్‌డీఏ, కేవీకే అధికారులతో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల వినియోగంపై సమీక్షించారు.

జీఎస్టీపై అవగాహన
సూపర్ జీఎస్టీ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో పలు కంపెనీల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. జీఎస్టీతో తగ్గిన రేట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సదరం క్యాంపులపై సమీక్ష
జిల్లాలో సదరం క్యాంపులను పక్కాగా నిర్వహించాలని, దివ్యాంగత్వ పరీక్షలు పటిష్టంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో దివ్యాంగ పింఛన్ల పునః పరిశీలనపై డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్ఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో–ఆర్డినేటర్, డీఆర్‌డీఏ పీడీలతో సమీక్షించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయ జనరల్ మేనేజర్ మహేష్ ప్రసాద్ పహాడ్సింగ్ కలెక్టర్ నాగరాణిని కలిసి నాబార్డ్ చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు.

అల్లుడిని ఎందుకు విచారించలేదు?

పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ, కొవ్వూరు డీఎస్పీ, ఎస్‌హెచ్‌వోలకు హైకోర్టు అక్షింతలు

సాక్షి, అమరావతి: తన కుమార్తె ఆకస్మిక అదృశ్యం వెనుక అల్లుడు, మరికొందరి పాత్ర ఉన్నట్లు అనుమానంగా ఉందని ఓ తండ్రి ఫిర్యాదు చేస్తే, ఇప్పటివరకు అల్లుడిని పోలీసులు విచారించకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. అనుమానితులను విచారించాల్సిన పోలీసులు ఆ పని చేయకుండా ఉదాసీనంగా ఉన్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. అదృశ్యమైన మహిళ కోసం గాలింపు జరిపామనేందుకు ఆధారాలు చూపిన పోలీసులు.. అల్లుడిని మాత్రం విచారించినట్లు ఆధారాలు చూపడం లేదంది. ఇది పోలీసుల దర్యాప్తు తీరును చెబుతోందని తెలిపింది. 13 ఏళ్ల క్రితం ఓ వివాహిత అదృశ్యమైతే ఇప్పటివరకు ఆచూకీని పోలీసులు కనుగొనలేకపోవడం, దర్యాప్తును సరైన దారిలో చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ, కొవ్వూరు డివిజన్ డీఎస్పీ, తాడేపల్లిగూడెం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోలను ఆదేశించింది. ఇందుకు గాను స్వయంగా తమ ముందు వ్యక్తిగతంగా హాజరు కావాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆపదలో ఆరోగ్యశ్రీ

అపర సంజీవనికి గ్రహణం
- ప్రభుత్వం బిల్లులివ్వక సమ్మెలోకి నెట్‌వర్క్ ఆస్పత్రులు
- ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల్లో సేవలు బంద్
- గాల్లో దీపాల్లా రోగుల ప్రాణాలు
- ఇప్పటికే సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు
- అగమ్యగోచరంగా పేదల పరిస్థితి



భీమవరంలోని ఓ నెట్‌వర్క్ ఆస్పత్రిలో సేవలు నిలిపివేయడంతో ఖాళీగా ఉన్న హెల్ప్‌డెస్క్

సాక్షి, భీమవరం: పేద, మధ్యతరగతి వర్గాలకు అపర సంజీవనిలా ఉన్న ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. రూ.కోట్లల్లో బకాయిలు పేరుకుపోయి ముందుకు సాగలేని పరిస్థితుల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెబాట పట్టాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 30 ఆస్పత్రులకు 26 చోట్ల సేవలు నిలిచిపోయి రోగుల ప్రాణాలు గాల్లో దీపాలవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

పశ్చిమలో 30 ఆస్పత్రులు
జిల్లాలోని 30 వరకు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నాయి. వీటిలో రెండు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉండగా, ఆర్థో, కన్ను, చెవి ముక్కు తదితర కేటగిరీ ఆస్పత్రులు 28 ఉన్నాయి. రోజుకు సుమారు 1,500 వరకు ఓపీ నమోదవుతుండగా ఇన్ పేషెంట్లుగా చేరేవారు 500 వరకు ఉంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేసింది. క్యాన్సర్ లాంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా సాయం అందించింది. 1,059 చికిత్సల సంఖ్య (ప్రొసీజర్ల)ను 3,257కి పెంచడంతో పాటు కుటుంబానికి రూ.5 లక్షలు ఉన్న వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం ద్వారా పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వైద్యసేవలకు ఆటంకం రాకుండా నిరంతరం అందిస్తూ వచ్చారు. రోగి కోలుకునే వరకూ కుటుంబ పోషణకు ఆరోగ్య ఆసరాగా అవసరమైన ఆర్థిక సాయాన్నీ అందించేవారు. కాగా కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి ఎసరుపెడుతోంది. ఆరోగ్య ఆసరాను నిలిపివేయడంతో పాటు ఆస్పత్రులకు బకాయిల విడుదలకు తీవ్ర జాప్యం చేస్తోంది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏప్రిల్‌లోనూ నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెలోకి వెళ్లాయి.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన

జిల్లాలోని 34 రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దాదాపు 74 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. సర్వీస్‌లోని పీహెచ్‌సీ వైద్యులకు పీజీ కోటాలో సీట్లను పునరుద్ధరించాలని, టైం బాండ్ ప్రమోషన్స్ కల్పించాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి బేసిక్‌పై 50 శాతం అలవెన్స్ ఇవ్వాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేల అలవెన్స్ ఇవ్వాలని, కౌన్సెలింగ్ విషయంలో అర్బన్ అండ్ నేటివిటీపై ఆరేళ్ల గడువుని ఐదేళ్లకు కుదించుట, నేటివిటీపై స్పష్టత కావాలని కోరుతూ రెండు వారాలుగా ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఏరియా, సీహెచ్‌సీల నుంచి రూరల్ పీహెచ్‌సీలకు వైద్యులను సర్దుబాటు చేస్తున్నా అటు ప్రధాన ఆస్పత్రులు, ఇటు రూరల్ పీహెచ్‌సీల్లోనూ పూర్తిస్థాయిలో వైద్యసేవలందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో పేదవర్గాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

రూ.100 కోట్ల మేర బకాయిలు



ఆరోగ్య సేవలు నిలిపివేస్తూ ఆస్పత్రి యాజమాన్యం ఏర్పాటుచేసిన నోటీస్ బోర్డు

జిల్లాలోని ఆయా ఆస్పత్రులకు రూ.100 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్టు అంచనా. వీటిలో ఒక్కో ఆస్పత్రికి రూ.40 లక్షల నుంచి రూ.7 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్టు యాజమాన్యాలు చెబుతున్నాయి. వీటిని విడుదల చేయాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) ప్రభుత్వానికి నోటీస్ ఇచ్చింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆశా పిలుపు మేరకు నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెబాట పట్టాయి. పలు ఆరోపణలతో నెలరోజుల క్రితమే భీమవరంలోని ఒక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సేవలు నిలిచిపోగా తణుకులోని మరో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లి గూడెం, నరసాపురంలోని 25 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోను శుక్రవారం నుంచి సేవలను నిలిపివేశారు. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన సహకారం అందించే ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్‌లు ఆరోగ్యమిత్రలు లేకుండా కనిపించాయి. ఆరోగ్యశ్రీపై ఉచిత వైద్యసేవలు పొందేందుకు వచ్చిన రోగులను ఆస్పత్రి సిబ్బంది సొమ్ములు చెల్లించిన వారికే వైద్యం అందుతుందని చెప్పడంతో పేదవర్గాల వారు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు నగదు చెల్లించి వైద్యసాయం పొందగా, చెల్లించే స్తోమత లేక మరికొందరు ఉసూరుమంటూ వెనుదిరిగారు. అధికారంలోకి వచ్చాక వైద్యసేవల్ని నిర్వీర్యం చేస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం తమకు ఆరోగ్య భరోసానిస్తున్న ఆరోగ్యశ్రీని మొత్తం ఆపేయాలని చూస్తోందని పేదవర్గాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు విడుదల చేయడం ద్వారా త్వరితగతిన సేవలు పునరిద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఏలూరు జిల్లాలో రూ. 60 కోట్ల బకాయిలు



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సలు అందిస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులకు కూటమి ప్రభుత్వం సుమారు రూ.60 కోట్ల మేర బకాయిలు పెట్టడంతో ఆస్పత్రి యాజమాన్యాలు ఉచిత సేవలకు నిరాకరిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో సేవలను నిలిపివేయాలని నిర్ణయించటంతో దాని ప్రభావం పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై పడుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఏలూరు జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ 32 వరకు ఉన్నాయి. అయితే వీటికి బకాయిల చెల్లింపుల్లో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. ఈ నేపథ్యంలో వైద్య సేవలు నిలిపివేయాలని ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలు నిర్ణయించాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఏలూరు నగరంలో మూడు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారు. మిగిలిన హాస్పిటల్స్ సైతం మెల్లగా సేవలను నిలిపివేసేందుకు చూస్తున్నాయి. జిల్లాలో ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు సుమారుగా రూ.60 కోట్ల మేర భారీగా బకాయిలు పేరుకుపోయినట్టు చెబుతున్నారు. ఒక్కో హాస్పిటల్‌కు సుమారుగా రూ.50 లక్షల నుంచి రూ.కోటి నుంచి రూ.2 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్టు తెలిసింది. చిన్న హాస్పిటల్స్‌కు బిల్లు బకాయిలు భారంగా మారటంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు శివారులోని ఒక హాస్పిటల్‌కి అయితే ఏకంగా రూ.20 కోట్ల వరకూ బకాయి ఉన్నట్టు సమాచారం. ఒక మిషనరీ సంస్థ హాస్పిటల్‌కు సైతం రూ.5 కోట్లకు పైగా బకాయి ఉందని చెబుతున్నారు.

ప్రైవేటీకరణపై కోటి సంతకాల ఉద్యమం

- గ్రామస్థాయి నుంచి ఉద్యమ కార్యాచరణ
- నవంబర్ 22 వరకు సంతకాల సేకరణ



భీమవరంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పరిశీలకుడు కృష్ణంరాజు, సమన్వయకర్త చినమిల్లి



తాడేపల్లిగూడెంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

భీమవరం: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల ప్రజాఉద్యమం చేపట్టినట్లు పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణరాజు చెప్పారు. శుక్రవారం మండలంలోని రాయలంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు క్యాంపు కార్యాలయంలో కోటి సంతకాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టగా.. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి పేదలకు వైద్యవిద్యను దూరం చేయడానికి పూనుకుందన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి 45 రోజులపాటు కోటి సంతకాల ఉద్యమం చేపట్టామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 60 వేల సంతకాల సేకరణ లక్ష్యమన్నారు. సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ నవంబర్ 22 వరకు రచ్చబండ, సంతకాల సేకరణ, 26న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రంలో ర్యాలీ, 23న నియోజకవర్గాల నుంచి జిల్లా కార్యాలయానికి సంతకాల సేకరణ ప్రతుల తరలింపు, 24న జిల్లా కేంద్రం నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించి గవర్నర్‌కు ప్రతులను అందజేస్తామన్నారు. పార్టీ నాయకులు మేడిది జాన్సన్, కామన నాగేశ్వరరావు, ఏఎస్ రాజు, పేరిచర్ల విజయనర్సింహరాజు, గాదిరాజు రామరాజు, చవాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తణుకులోని పార్టీ కార్యాలయంలో పరిశీలకుడు మురళీకృష్ణంరాజు, కాళ్ల మండలం పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో ఉండి సమన్వయకర్త పీవీఎల్ నరసింహరాజు, పాలకొల్లులోని పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) కోటి సంతకాల సేకరణ పోస్టర్లు ఆవిష్కరించారు.

ఆదాయమున్నా.. కనిపించని వైభవం!

- చినవెంకన్న ఉత్సవాల నిర్వహణపై భక్తుల్లో అసంతృప్తి
- శ్రీవారి రథంలో కనిపించని అమ్మవార్లు
- ట్యాప్ కిందే శ్రీచక్రస్నానం
- కోనేరు, స్వామి కల్యాణ మండపాల నిర్మాణం ఊసే లేని వైనం



అశ్వాలు లేకుండా ఉన్న ప్రస్తుత రథం



ట్యాప్ కింద శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు (ఫైల్)

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. నిత్యం వేలాది మంది, శని, ఆదివారాలు, పర్వదినాల్లో అంతకుమించి భక్తులు పోటెత్తుతున్నారు. స్వామివారి వార్షిక ఆదాయం రూ.180 కోట్ల పైమాటే. ఒక్క హుండీ ఆదాయమే నెలకు సుమారు రూ.3 కోట్ల వరకు ఉంటోంది. వీటికి దాతల విరాళాలు అదనం. అయితే ఆదాయం ఎంత పెరుగుతున్నా.. స్వామివారి వైభవం మాత్రం పెరగడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నామమాత్రంగా జరుగుతున్న పలు కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. ఇదిలా ఉండగా అధిక శాతం ఆదాయాన్ని భక్తులకు సౌకర్యాల కల్పన పేరుతో అధికారులు వృథా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్యాప్ కింద శ్రీచక్రస్నానమా..
బ్రహ్మోత్సవాల్లో శ్రీచక్రస్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. చిన్నపాటి ఆలయాల్లో సైతం ఈ వేడుక వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే శ్రీవారి క్షేత్రంలో మాత్రం మొక్కుబడిగా జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి. సాధారణంగా శ్రీచక్రస్నానాన్ని కోనేరులో నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తులు ఆ కోనేరులో స్నానం చేసి పునీతులవుతారు. అయితే ద్వారకాతిరుమల క్షేత్రంలో కోనేరు లేకపోవడంతో ఆలయ యాగశాలలో ఉన్న ట్యాప్ కింద స్వామివారికి శ్రీచక్రస్నానాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై భక్తులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

రథంలో కనిపించని అమ్మవార్లు : దేవస్థానం ఏడేళ్ల క్రితం తయారు చేయించిన రథాన్ని రథోత్సవాలకు వినియోగిస్తున్నారు. అయితే రథ నిర్మాణంలో తలెత్తిన లోపాల కారణంగా రథంలో స్వామివారు మినహా, అమ్మవార్లు కనిపించడం లేదు. దీంతో రథయాత్రలో పాల్గొనే భక్తులు అమ్మవార్ల దర్శనం కాక అసంతృప్తి చెందుతున్నారు. రథానికి ముందు భాగంలో అశ్వాలు లేక జీవకళ లేదనే విమర్శలు ఉన్నాయి.

అటకెక్కిన అంచనాలు
గతంలో ఆలయ ప్రాకారం లోపల స్వామివారి ప్రధాన ఆలయాన్ని యథాతథంగా ఉంచి, నలువైపులా గ్రానెట్ స్టోన్‌తో అనివేటి మండపాన్ని నిర్మించేందుకు అంచనాలు రూపొందించారు. గతంలో బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి కల్యాణాన్ని కొండ కింద పాదుకా మండపం వద్ద ఉన్న కల్యాణ మండపంలో నిర్వహించేవారు. అది చాలడం లేదని ఏడేళ్ల క్రితం కల్యాణాన్ని ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోకి మార్చారు. అక్కడే తాత్కాలిక మండపాన్ని నిర్మించి అందులో కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆలయం తూర్పు వైపునే స్టోన్‌తో వాస్తు ప్రకారం మండపాన్ని నిర్మించాలని అంచనాలు రూపొందించారు. అయితే ముందుకు సాగలేదు. దీంతో ఇప్పటికీ తాత్కాలిక మండపంలోనే శ్రీవారి కల్యాణం జరుగుతోంది. ఆలయ ఈశాన్య భాగంలో కోనేరు నిర్మించాలని అంచనాలు రూపొందించారు. అయినా కార్యరూపం దాల్చలేదు.

రూ.కోట్లు వృథా

కొండపైన టోల్‌గేట్ సమీపంలో రూ.8.50 కోట్లతో నిర్మించిన కల్యాణకట్ట ఆలయానికి దూరం కావడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. రూ.4.10 కోట్లతో నిర్మించిన క్యాంటీన్ భక్తులకు అందుబాటులో లేకపోవడంతో కల్యాణ మండపం, డార్మెటరీ, ఆధ్యాత్మిక గ్రంథాలయంగా మారిపోయింది. అలాగే రూ.2.79 కోట్లతో నిర్మించిన ప్రసాద విక్రయశాల, బుకింగ్ కౌంటర్లు ఆలయానికి దూరం కావడంతో భక్తులు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదు. దీంతో కొండపైన అన్నదాన భవనం వద్ద, కొండ కింద సమాచార కేంద్రంలో ప్రసాదాలను విక్రయిస్తున్నారు. ఇటీవల వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద నుంచి కొండపైకి కాలినడకన వెళ్లే భక్తుల కోసం రూ.లక్షలు వెచ్చించి మెట్ల మార్గాన్ని నిర్మించారు. ఇప్పుడు వ్యాపారులకు ఇబ్బంది కలుగుతుందని ఆ మెట్ల మార్గాన్ని ప్రారంభించకుండానే మూసేశారు. భవిష్యత్తు అవసరాల మాట ఎలా ఉన్నా.. అధికారుల చర్యలు కారణంగా భక్తులకు ప్రస్తుతం సౌకర్యాలు దూరంగా ఉన్నాయి. ఆలయ అర్చకుల సలహాలు, సూచనలు లేకుండానే అధికారులు ఈ నిర్మాణాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే పితానివి తప్పుడు ఆరోపణలు



పెనుమంట్రలో విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్ ప్రియాంక, ఉప సర్పంచ్ శ్రీనివాసరాజు

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామ అభివృద్ధి విషయంలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తమపై గ్రామసభలో తప్పుడు ఆరోపణ చేశారని పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు ధ్వజమెత్తారు. శుక్రవారం పెనుమంట్రలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం జరిగిన గ్రామసభలో పితాని చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు ఎంతో గౌరవం ఇస్తున్నామని చెప్పుకుంటున్న పితాని.. సభా మర్యాద లేకుండా మహిళా సర్పంచ్‌గా తనకిచ్చే గౌరవం ఇదేనా అని ఆమె ప్రశ్నించారు. బ్రాహ్మణచెరువులో ఓహెచ్ఆర్ వాటర్ ట్యాంక్ మరమ్మతులకు కలెక్టర్ ఉత్తర్వులు మేరకు గతేడాది తీర్మానం చేశామని, అయితే ఎమ్మెల్యే పితాని సర్పంచ్ తీర్మానం చేయలేదని గ్రామసభలో చెప్పడం సరికాదన్నారు. అలాగే ఆగస్టులో పంచాయతీ ఆవరణలో జరిగిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడిన తహసీల్దార్‌పై తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. పంచాయతీలో జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరు కూటమి నాయకులు అధికారులను బెదిరించి దౌర్జన్యంగా వేదికపైకి వచ్చి కూర్చుంటున్నారని, దీంతో తాను గురువారం జరిగిన గ్రామ సభకు అధ్యక్షత వహించడానికి నిరాకరించానన్నారు. గ్రామ అభివృద్ధి పనులకు కొందరు కూటమి నేతలు అడ్డుపడుతుండగా.. ఎమ్మెల్యే పితాని వారికి వత్తాసు పలుకుతూ తనపై, తన వార్డు సభ్యులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, పంచాయతీ బోర్డు సభ్యులు కొవ్వూరి నాగమోహన రాజారెడ్డి, తేతల ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్తీక మాసంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు తదితరులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పూజలకు వచ్చే భక్తులు, యాత్రికులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శుక్రవారం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అధికారులు, భక్తులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు రాత్రి సమయంలో బస చేసేలా ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న దేవదాయ శాఖ సత్రాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. శనివారం సంత రోడ్డులో దిగిన యాత్రికులు చేపల మార్కెట్‌లో నుంచి వస్తున్నారని భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయడమా.. బస్సులను ఎన్టీఆర్ కళా క్షేత్రం వరకూ తీసుకొచ్చి అక్కడ దిగి ఆలయానికి వెళ్లేలా చూడడమా అనేది నిర్ణయిస్తామన్నారు. శనివారం, ఆదివారం, సోమవారం, కార్తీక పౌర్ణమి, శిల్క్ ద్వాదశి రోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని దీనిపై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, సీఐ కోలా రజనీకుమార్, ఈవోపీఆర్డీ మూర్తిబాబు, ఫైర్ ఆఫీసర్ వైవీ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ, గుర్తింపు పొందిన ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ(హానర్సు) ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశం కోసం మూడో దశ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 16, 17 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీ పాలక భవనంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు స్వయంగా తగిన ధృవపత్రాలతో హాజరు కావాలన్నారు.

పశ్చిమలో మద్యం దందా

- అడ్డగోలు ధరకు మద్యం విక్రయాలు
- మందుబాబులు సహకరించాలంటూ వైన్‌షాపుల వద్ద ఫ్లెక్సీలు
- క్వార్టర్‌కు రూ.10 నుంచి 20 పెంచి విక్రయాలు
- నెలవారీ మామూళ్ల మత్తులో ఎక్సైజ్, పోలీస్ శాఖలు
- కూటమి నేతలే సిండికేట్ సభ్యులు





తాడేపల్లిగూడెం రూరల్‌లో వైన్‌షాపు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమలో మద్యం దందా ఏరులై పారుతుంది. అధికార పార్టీ కనుసన్నల్లో వీధి వీధికి బెల్టుషాపులు ఏర్పాటు చేసి అడ్డగోలు దోపిడీ ఓ వైపు కొనసాగిస్తూ మరోవైపు వైన్ షాపుల్లో ఎమ్మార్పీకి మించి అధిక ధరకు విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకునే పనిలో మద్యం సిండికేట్ పడింది. పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్ శాఖ, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీస్ శాఖను మాముళ్లతో కట్టడి చేసి దందా జోరుగా సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 352 మద్యం దుకాణాల్లో నెలకు సగటున రూ.260 కోట్ల మద్యం విక్రయాలు సాగుతున్నాయి.

ఉమ్మడి పశ్చిమలో ఎమ్మార్పీ ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతుంది. ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మార్పీతో సంబంధం లేకుండా క్వార్టర్ సీసాపై రూ.10 నుంచి రూ.20 అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఎక్సైజ్ మొదలుకొని ప్రజాప్రతినిధుల వరకు అందరికీ మాముళ్ళ చెల్లించడం అనివార్యం కాబట్టి అధిక ధర తప్పదని వైన్‌షాపు నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు. మరోవైపు కూటమి నేతలే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం సిండికేట్లు కావడంతో ధరలు మొదలుకొని సమయ పాలన వరకు అన్ని ఇష్టారాజ్యంగా మారిపోయాయి. కొన్ని నియోజకవర్గాల్లో మద్యం వ్యాపారులు ఇంకో అడుగు ముందుకేసి మద్యం షాపుల వద్ద మద్యం ధరలు పెరిగాయి. మందుబాబులు సహకరించాలని ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. సమయ పాలనతో పాటు ఎమ్మార్పీ ఉల్లంఘన లేకుండా పక్కాగా విక్రయాలు కొనసాగించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేటుపరం చేస్తున్నామనే పేరుతో అన్ని కూటమి నేతలకు కట్టబెట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కీలక మద్యం సిండికేట్‌లలో టీడీపీ, జనసేన నేతలు ఉండటం గమనార్హం. షాపు ఏర్పాటు సమయంలో ఒక్కొక్క ఎమ్మెల్యే ఒక్కో రేటు పెట్టి మరీ సిండికేట్ నుంచి వసూలు చేశారు. జిల్లాలో సగటున ఒక్కో షాపు నుంచి రూ.3 లక్షలు మొదలుకొని అత్యధికంగా 6 లక్షల వరకు వసూలు చేశారు. అలాగే షాపు ఏర్పాటు క్రమంలో 10 శాతం ఉన్న కమిషన్ 14 శాతానికి పెంచడం, ఎమ్మార్పీ ఉల్లంఘనకు అధికార పార్టీ నుంచి పోలీసు వరకు అందరూ సహకరించడంతో ఇష్టారాజ్యంగా రేట్లు మారిపోయాయి. క్వార్టర్‌కు రూ.10 నుంచి రూ.20 వరకు, ఫుల్ బాటిల్‌కు రూ.50 నుంచి రూ.100కు పెంచి విక్రయిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 155 మద్యం దుకాణాల ద్వారా నెలకు రూ.110 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 197 వైన్‌షాపుల్లో నెలకు రూ.160 కోట్లకు పైగా విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది ప్రధానంగా దసరా పండుగ రోజు గాంధీ జయంతి కావడంతో మద్యం దుకాణాలు మూతపడ్డాయి. 1న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.18 కోట్ల మేర విక్రయాలు జరిగినట్లు అంచనా.

నెలవారీ వసూళ్లలో ఎక్సైజ్, పోలీస్ శాఖలు

ఎమ్మార్పీ ఉల్లంఘన, సమయ పాలన, మద్యం నాణ్యత ఇలా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన ఎక్సైజ్ శాఖను పూర్తిగా మాముళ్ళతో కట్టడి చేశారు. ఒక్కో షాపునకు రూ.50 నుంచి రూ.80 వేల వరకు సగటున వసూలు చేస్తున్నారు. పోలీసులు ఒక్కో షాపు నుంచి రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. కేవలం ఎక్సైజ్, పోలీస్ నెలవారీలే రూ.2 కోట్లపై ఉంటాయని అంచనా. దీంతో ఎమ్మార్పీ ఉల్లంఘనపై కన్నెత్తి చూసిన దాఖలాలు జిల్లాలో లేవు. మరోవైపు కల్తీ మద్యం రాష్ట్ర వ్యాప్తంగా కుదిపేస్తున్నా జిల్లా సరిహద్దులో తెలంగాణ ప్రాంతం ఉండటంతో తెలంగాణ మద్యం విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం. ఏలూరు జిల్లాలో కీలక నియోజకవర్గంలో మాత్రమే ఎక్సైజ్, పోలీసులకు ముడుపులు ఇవ్వటానికి వీల్లేదని ఎమ్మెల్యే హుకుం జారీ చేశారు. ఎందుకంటే ప్రతి సిండికేట్‌లో సదరు ప్రజాప్రతినిధే సిండికేట్‌లో కీలక భాగస్వామ్యం కావడం విశేషం.

దళిత వాడలకు ఏం చేశారు?



అర్తమూరులో మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు పుష్పరాజ్

ఉండి: కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా దళితవాడలకు ఏం చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత నాయకుడు జొన్నల వజ్రం ఆధ్వర్యంలో శుక్రవారం అర్తమూరులో మాలమహానాడు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ ప్రతీ పంచాయతీకి ఇచ్చే సబ్‌ప్లాన్ నిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేలు కనీసం దళితవాడల్లో పరిస్థితులపై పర్యటించి పరిశీలించడం లేదని అన్నారు. నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. పేదల చదవుల కోసం చేపట్టిన మెడికల్ కాలేజీలు పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరణ ఎలా చేపడతారని ప్రశ్నించారు. పేదలు చదవుకోవడం ప్రభుత్వానికి ఇష్టం లేదా అని అన్నారు. వాహనమిత్ర పథకం అమలులో పక్షపాతాన్ని ప్రశ్నించారు. అర్హులకు కూడా పథకాలు ఇవ్వకపోతే కూటమి ప్రభుత్వం ఎవరికి ఇస్తుందని ప్రశ్నించారు. వజ్రం అనే ఆటోడ్రైవర్‌కు వాహనమిత్ర ఎందుకు రాలేదో కనీస కారణం కూడా అధికారులు తెలియకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు జొన్నల వజ్రం, నేతల సువర్ణ రాజు, ఇంటి సుందర్‌కుమార్, కోలా ప్రసాద రావు, మున్నా, దాసరి చిరంజీవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానిది డ్రామా పాలన

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డ్రామా పాలనలా ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామని మాయ చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలూ డేటా సెంటర్లను నిరాకరిస్తే.. కోట్లు దండుకోవడానికే చంద్రబాబునాయుడు మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి కుట్రలు చేస్తున్నాడన్నారు. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సుమారు రూ.3 వేల కోట్ల బకాయిలు ఇవ్వక పోవడంతో ఆయా ఆసుపత్రులు ఆరోగ్యశ్రీలో వైద్యం నిలిపి వేశాయని, దీంతో పేద ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 108 అంబులెన్స్‌లకు పెట్రోలు బిల్లులు చెల్లించకపోవడం, సిబ్బందికి జీతాలు నిలుపుదలం చేయడంతో వాహనాలు సేవలు అందించలేకపోతున్నాయన్నారు.

కూటమిది దుర్మార్గ పాలన

అయ్యన్నపాత్రుడు రాష్ట్రంలో వైద్య కళాశాలలు నిర్మించడానికి జీఓ విడుదల కాలేదని అసెంబ్లీ సమావేశాల్లో చెప్పడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనకు ఉదాహరణ అని దుయ్యబట్టారు. హామీలు అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తారనే భయంతో ప్రజలను ఏమార్చేందుకు కొత్త డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ ఎక్కడ ప్రజా సమావేశాలు ఏర్పాటు చేసినా చంద్రబాబుకు చెమటలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. నెల్లూరులో వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని నిర్వహించకుండా పోలీసులను అడ్డు పెట్టినా వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు సభను విజయవంతం చేశారన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ నాయకులతో కూటమి ప్రభుత్వమే కల్తీ మద్యం తయారు చేయించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మద్యం షాపులకు సరఫరా చేస్తోందని విమర్శించారు. అరాచక పాలనను గమనిస్తున్నారనే భయంతో ప్రజలను డైవర్షన్ చేసేందుకు పవన్ కల్యాణ్ కాకినాడ పర్యటన, రూట్ మ్యాప్ విడుదల చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కూటమికి గుణపాఠం చెప్పి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి కొట్టు స్పష్టం చేశారు.



ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలి



నిట్‌లో విద్యార్థుల రోబోటిక్ విన్యాసాలు

తాడేపల్లిగూడెం: విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు అన్నారు. నిట్‌లో శుక్రవారం టెక్రియా 2కె25 అట్టహాసంగా ప్రారంభమైంది. పరిశోధనల్లో విద్యార్థులు కొత్త శిఖరాలను అధిరోహించాలన్నారు. అన్ని విషయాలపై అవగాహన పెంచుకొని నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలన్నారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ కె.హిమబిందు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలన్నారు. కో-ఆర్డినేటర్‌గా డీన్ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టెక్రియా కార్యక్రమ కార్యదర్శి వేదాంత రెడ్డి, డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ వీరేష్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. టెక్రియాలో విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన ప్రదర్శనలు అబ్బుర పర్చాయి.

పోక్సో కేసు నమోదు

యలమంచిలి: బాలికను వేధిస్తున్న కేసులో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు యలమంచిలి మండల ఎస్సై గుర్రయ్య తెలిపారు. శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదలంక గ్రామానికి చెందిన కొల్లి నాని అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానంటూ రోజు వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అంతర పంటలపై ఆసక్తి



చింతలపూడి: నియోజకవర్గంలో రైతులు అంతర పంటలపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ఏటా అతివృష్టి లేదా అనావృష్టితో ఒక పంటకు నష్టం వాటిల్లినా మోరో పంట ఆదుకుంటుందన్న ఆశతో ఖర్చుకు వెనుకాడకుండా అంతర పంటలను సాగు చేస్తూ నిరంతర లాభాలను సాధిస్తున్నారు. అంతేకాక పెరుగుతున్న ఎరువులు, పురుగుమందులు, సాగు పెట్టుబడులతో గిట్టుబాటు ధర లభించక మరింత ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు వాణిజ్య పంటలతో పాటు అంతర పంటలపై మొగ్గు చూపుతున్నారు. మెట్ట ప్రాంతంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగానే రైతులు అంతర పంటలు సాగు చేస్తున్నట్లు అంచనా. అంతర పంటల్లో భాగంగా కొబ్బరిలో కోకో, అరటి, వక్క, ఆయిల్‌పాం తోటల్లో వేరుశెనగ, మొక్కజొన్న, మామిడిలో మొక్కజొన్న సాగు, ఏకకాలంలో రెండు, మూడు రకాల కూరగాయల సాగు చేస్తున్నారు.

అంతర పంటల సాగు వల్ల వాణిజ్య పంటల సాగులో పెట్టుబడులను అంతర పంటల ద్వారా రైతులు సమకూర్చుకుంటున్నారు. దీనివల్ల కూలీల కొరతను అధిగమించడమే కాకుండ ఎరువులు, పురుగు వుందులు వాడినప్పుడు ఖర్చు తగ్గుముఖం పట్టినట్లు రైతులు చెబుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించే వీలు కలుగుతుందని చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడ అంతర పంటల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రైతులకు ప్రత్యేక రాయితీలు, రుణాలు అందించి అంతర పంటల సాగు పెరగడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆయిల్ పాం లో మొక్కజొన్న పంట



అరటిలో వేరుశెనగ పండిస్తున్న దృశ్యం



కొబ్బరిలో అరటి పంట

రాయితీలు ఇవ్వాలి



అంతర పంటల సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి. వాణిజ్య పంటల్లో అంతర పంటలు వేసుకోవడానికి విత్తనాలు ఉచితంగా సరఫరా చేసి రైతులను ప్రోత్సహించాలి. అంతర పంటలు పండించడం వల్ల సాగు ఖర్చులు తగ్గాయి.

– కె.రామారావు, రైతు, సీతానగరం

పెట్టుబడులు పెరిగాయి



ప్రస్తుతం వ్యవసాయంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. కూలీలు కూడ గ్రామాల్లో దొరకడం లేదు. దీంతో ఒకేసారి రెండు రకాల పంటలు పండించకపోతే గిట్టడం లేదు. అంతర పంటల వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం కూడ వస్తోంది.

– తాండ్ర రామకృష్ణారావు, సర్పంచ్, చింతంపల్లి

ఒంటరి వృద్ధులే టార్గెట్

- తణుకులో భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- 10 మంది అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్
- 30 కాసుల ఆభరణాలు స్వాధీనం



చోరీకి సంబంధించి దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, మారణాయుధాలు

తణుకు అర్బన్: తణుకులో వృద్ధురాలిని భయపెట్టి 70 కాసుల బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. 10 మంది అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకుని సుమారు 30 కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. గత నెల 26 రాత్రి స్థానిక వారణాసి వారి వీధిలో నివసిస్తున్న వాకలపూడి కనకదుర్గ నివాసంలో చోరీకి సంబంధించి ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసుల దర్యాప్తులో పట్టుబడిన దొంగల నుంచి రూ.16 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. తణుకు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్ వివరాలు వెల్లడించారు. ఈ భారీ చోరీ కేసులో ఎస్పీ ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని, పోలీసు అధికారులు 6 బృందాలుగా ఏర్పడి మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో జల్లెడ పట్టి చైన్ లింక్ మాదిరిగా దొంగలను పట్టుకున్నారన్నారు. చోరీ సొత్తును పంచుకున్నారని, వృద్ధులు, సంపన్నుల ఇళ్లను టార్గెట్ చేసుకుని ఈ దొంగల ముఠా చోరీలకు పాల్పడుతుందని స్పష్టం చేశారు. ఈ కేసులో మరికొందరిని పట్టుకోవాల్సి ఉందని, మిగిలిన ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకోవాల్సి ఉందని, తణుకు పట్టణ, రూరల్ సర్కిల్ పోలీసులు అదే పనిలో ఉన్నారన్నారు. చోరీకి సంబంధించి 10 బంగారు గాజులు, జత చెవి దుద్దెలు, జత మాటీలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనుమానితులు ఎవరైనా కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ముద్దాయిలను పట్టుకోవడంలో సహకరించిన పట్టణ సీఐ ఎస్.కొండయ్య, రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, తాడేపల్లిగూడెం రూరల్ సీఐ బీబీ రవికుమార్, పట్టణ ఎస్సైలు కె.శ్రీనివాస్, కె.ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై డి.ఆదినారాయణ, రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్, అత్తిలి ఎస్సై పి.ప్రేమ్‌రాజ్ ఏఎస్సైలు ఎస్.శ్రీధర్, పి.సంగీతరావు, పి.సత్యనారాయణ, 10 మంది కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

దివ్యాంగులకు ఎన్నాళ్లీ పాట్లు?



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పింఛను వెరిఫికేషన్ కోసం వేచి ఉన్న దివ్యాంగులు



పింఛను వెరిఫికేషన్ కోసం వేచి చూస్తున్న దివ్యాంగుడు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పింఛను వెరిఫికేషన్ పింఛనుదారుల సహనానికి పరీక్షగా మారింది. శుక్రవారం పింఛను వెరిఫికేషన్‌కు ఉదయం 9 గంటలకు హాజరైన దివ్యాంగులు సాయంత్రం వరకు కూడా చేయకపోవడంతో విలవిల్లాడిపోయారు. కూటమి ప్రభుత్వం తమకు చుక్కలు చూపిస్తుందని, గతంలో లేని వెరిఫికేషన్‌లు ఇప్పుడేంటని, 20 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న తమకు ఈ పరీక్షలేంటని, పింఛను తీసేందుకే ఈ పరీక్షలా అని గగ్గోలుపెట్టారు. వెరిఫికేషన్‌కు వైద్యులు కేంద్రం వద్దే అందుబాటులో ఉన్నప్పటికీ సాంకేతికత లోపంతో వెరిఫికేషన్ చేయలేకపోయిన దుస్థితి. శుక్రవారం సుమారుగా 60 మంది వరకు వచ్చారు. సదరం లాగిన్‌లో సాంకేతిక ఇబ్బందులతో రోజంతా పడిగాపులు పడాల్సివచ్చింది. ఎట్టకేలకు సాయంత్రం 4 గంటలకు కన్నుకు సంబంధించిన దివ్యాంగులకు వెరిఫికేషన్ పూర్తిచేయగా ఆర్థోపెడిక్‌కు సంబంధించి 40 మంది వరకు వేచిచూడాల్సి వచ్చింది.

ఏ సదుపాయాలు లేవు

పింఛను వెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులకు ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో దివ్యాంగులు అల్లాడిపోయారు. కుర్చీలు తప్ప మరే ఇతర వసతి కల్పించలేదని పింఛనుదారులు ఆరోపించారు. ఆహారం తిని రమ్మని సిబ్బంది చెప్పారని పింఛనుతోనే బతుకుతున్న ఏం కొనుక్కుని తినగలమని, ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడంలేదంటూ దివ్యాంగులు ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు సాయంత్రం 5 గంటలకు ఈరోజు వెరిఫికేషన్ అవ్వదని, ఎప్పుడు రావాలో తిరిగి ఫోన్ చేస్తామని సిబ్బంది చెప్పడంతో దివ్యాంగులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఈ సమస్యపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్‌ను వివరణ కోరగా దివ్యాంగుల వివరాలు సదరం లాగిన్‌లో వారిని జంగారెడ్డిగూడెంగా చూపిస్తుండడంతో సాంకేతిక కారణాలతో వెరిఫికేషన్ చేయడం కుదరలేదని చెప్పారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: నగరంలోని శనగపప్పు పేట, ఇందిరాకాలనీ సమీపంలో ఉంటున్న వ్యక్తి బాత్‌రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసులు వివరాల ప్రకారం.. ఎర్ర వెంకటేశ్వరరావు (48) ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె భీమవరంలో ఇంజనీరింగ్ చదువుతూ ఉండడంతో గత 9 నెలలుగా అక్కడే భార్య, కుమార్తెతో ఉంటున్నాడు. ఇటీవల ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.15 వేల భృతి డబ్బులు వేస్తుందని, వాటిని తీసుకునేందుకు ఏలూరు వచ్చాడు. అప్పటి నుంచీ ఏలూరులోనే ఉంటున్నాడు. అతను శుక్రవారం మధ్యాహ్నం ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పిల్లలకు ప్రేరణ కృత్యాలు అలవర్చాలి



తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

అత్తిలి: బిడ్డ పుట్టినప్పటి నుంచి మూడేళ్ల వరకు ప్రేరణ కృత్యాలను అలవర్చాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అత్తిలి మండలం వరిఘేడు–2 అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో పిల్లల తల్లులతో హోం విజిట్ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవచేతన బాల్యారంభ ప్రేరణ ఎంతో అవసరమని, ప్రేరణ కోసం పిల్లలకు తగిన వాతావరణాన్ని అందించాలన్నారు. సున్నితమైన ఉపశమన వస్తువులను చేరుకోవడం, అనుకరణ, మాట్లాడటం వంటి కృత్యాలను చేయించాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ బేబి, హెల్పర్ ఎం.సుహాసిని పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి



గేదెల పరిశోధనస్థానంలో నేషనల్ ఎగ్‌డే

తాడేపల్లిగూడెం: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని గేదెల పరిశోధన స్థానం అధికారి కె.ఆనందరావు అన్నారు. దీని కోసం ప్రతి ఒక్కరూ ఏడాదికి 180 కోడి గుడ్లు తినాలన్నారు. శుక్రవారం వెంకట్రామన్నగూడెంలోని గేదెల పరిశోధన స్థానంలో నిర్వహించిన నేషనల్ ఎగ్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధిక పోషకాలు కలిగిన ప్రకృతి ప్రసాదం గుడ్డు అన్నారు. సహజ పోషకాలతో నిండిన అద్భుత ఆహారం గుడ్డు అనే కరపత్రికను ఆవిష్కరించారు. విద్యార్థులకు గుడ్లు ఉచితంగా అందజేశారు. సీనియర్ శాస్త్రవేత్త కె.నాగరాజకుమారి, కేవీకే సైంటిస్టు వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు డ్రైడే పాటిద్దాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నివారణకు డ్రైడే పాటిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని వీకర్స్ కాలనీ 2వ వార్డులో శుక్రవారం సబ్‌యూనిట్ పరిధిలో డ్రైడే, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ వర్షం నీరు నిల్వ ఉండటం వలన ఏడీస్ దోమలు పెరిగి, కుట్టడం వలన డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు కలుగుతాయని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ కాంతారావు, రాధాకృష్ణ, ఏఎన్‌ఎంలు మల్లిక, రత్నకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలోని దివ్యాంగులకు డ్రాయింగ్ పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు, బ్యాట్స్, స్నాక్స్ అందజేశారు. స్నేహ మైండ్ అధినేత డాక్టర్ పృథ్వీరాజ్ భవిత కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతూ పిల్లలకు తమ వంతు సేవలు అందజేస్తామని చెప్పారు. చెన్నారెడ్డి సతీష్, రాజా త్రినాద్, మానేపల్లి కిరణ్, యర్రా ఆంజనేయ స్వామి, ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, దివ్యాంగుల పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థి దశలోనే ఏ సమయంలో ఎలా మాట్లాడాలి? ఎలా స్పందించాలి? ఏమి చేయాలి? వంటి వాటిపై అవగాహన పెంచుకుంటే ఏ విషయంలోనైనా విజయం సాధించవచ్చని చార్టెడ్ అకౌంటెంట్ బంగారు మనోజ్ విష్ణు అన్నారు. శుక్రవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ పాలకొల్లు రైజింగ్ సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మూలకు చేరిన చెత్త వాహనాలు

- బాగు చేయించాలని కోరుతున్న ప్రజలు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్త
- పారిశుద్ధ్య కార్మికుల తీవ్ర ఇబ్బంది



రేలంగిలో పేరుకుపోయిన చెత్త

ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ వాహనాలు సరిగా లేకపోవడంతో చెత్త సేకరించే శానిటేషన్ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, నాయకులు సరిగా పట్టించుకోకపోవడంతో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడం కత్తి మీద సాముగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పర్యటనకు వచ్చినప్పుడు చెత్త సేకరణకు వాహనాలు సరిపోవడం లేదని అడిగినా ఫలితం లేకుండా పోయింది. రేలంగి గ్రామం ఇరగవరం మండలం మేజర్ గ్రామ పంచాయతీ అంతేకాదు జెడ్పీటీసీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో వారి గెలుపోటములు శాసించే స్థాయి రేలంగి గ్రామ పంచాయతీది. 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 14 వేల 559 మంది జనాభా ఉండగా ఇప్పుడు 20 వేల వరకు జనాభా ఉన్నారు. దీంతో వారి అవసరాలు పెరిగిపోయి వారితో పాటు రోడ్ల పక్కన, డ్రెయినేజీల్లో చెత్తను వేయడం ఎక్కువైంది. రేలంగి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్తను డంపింగ్ యార్డులకు చేరవేయడానికి 22 మంది శానిటేషన్, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. వారిద్దరికీ ఒక వాహనం చొప్పున 11 చెత్త సేకరించే వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి రోజూ పారిశుద్ధ్య కార్మికులు రెండు నుంచి నాలుగు సార్లు చెత్తను డంపింగ్ యార్డులకు చేరవేయవలసి ఉంటుంది. పంచాయతీలో ఉన్న వాటిలో సరిగా పని చేసేవి కనీసం మూడు వాహనాలు కూడా లేవు. కొన్ని వాహనాలు బ్యాటరీ వాహనాలు, అయితే మరి కొన్ని వాహనాలు డీజిల్, పెట్రోల్ వాహనాలు వాటి నిర్వహణకు నెలకు వేలల్లో ఖర్చవుతుంది. కానీ వాటి ఫలితం మాత్రం కనబడటం లేదు.

ఎక్కడి చెత్త అక్కడే..

దీంతో గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతుంది. దాని వలన దుర్వాసన రావడం, ఈగలు, దోమలు ఎక్కువగా ఉండటం వలన ప్రజలు తరచూ రోగాల బారిన పడుతున్నారు. దీనికి తోడు వర్షాలు ఎక్కువగా కురవడంతో చెత్త ఎక్కువగా పేరుకుపోతుంది. ప్రతి రోజూ చెత్తను బయటకు తరలించడం పారిశుద్ధ్య కార్మికులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. వాహనాలు తక్కువగా ఉండటం వాటిలో కొన్ని పనిచేయకపోవడంతో ఉన్న వాహనాలతోనే చెత్తను బయటకు తరలిస్తున్నారు. ఇది చాలా కష్టంగా ఉంటుంది. ట్రిప్పులు ఎక్కువగా వేయడం వలన వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని బాగు చేస్తున్నారు. అయితే శాశ్వత పరిష్కారం చూపడం లేదని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. ఉదయాన్నే తెల్లవారు జామున రోడ్లు శుభ్రపరిచిన చెత్తను ఎక్కడికక్కడ పోగులు పెడుతున్నా వాటి తరలించడానికి వాహనాలు సరిగా లేకపోవడంతో ముఖ్యంగా మహిళా కార్మికులకు ఇంటికి వెళ్లడానికి ఆలస్యమవుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా చెత్త తరలించే వాహనాలు బాగు చేసి వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చి చెత్తను తొలగించడంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రేలంగిలో మూలనపడ్డ చెత్త సేకరణ వాహనాలు



పూర్తిగా పాడైన సేత్త సేకరణ వాహనాలు

కొనసాగుతున్న స్కూల్ గేమ్స్



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి సెలక్షన్స్ శుక్రవారం రెండో రోజు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సెలక్షన్స్ పలు విభాగాల్లో అండర్ 14, అండర్ 17 పోటీలు బాల బాలికలకు జరిగాయి. 32 పాఠశాలల నుంచి వాలీబాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ ప్లేయర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సెలక్షన్లు ఎ.ఈశ్వర్ శ్రీనివాస్, మండల పీడీలు, పీఈటీల సహకారంతో నిర్వహించారు.

ఎస్‌ఎఫ్‌జీ పోటీలకు కడకట్ల విద్యార్థులు

పెంటపాడు: స్కూల్ ఫెడరేషన్ పోటీలకు కడకట్ల కోడే వెంకట్రావు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యోగా ఉపాధ్యాయిని జి.రూప శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఈ పోటీలు నిర్వహించగా అండర్–17 బాలబాలికలకు సంబంధించి యోగాలో నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. హెచ్‌ఎం ఈవీ కృష్ణారావు, పీఈటీ సీహెచ్ నాగేంద్ర తదతరులు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

మానసిక ఆరోగ్యంతోనే అభివృద్ధి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు మానసిక ఆరోగ్యంతోనే అభివృద్ధి చెందగలరని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ క్యాంపస్‌లో డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పుత్రయ్య మాట్లాడారు. స్నేహ మైండ్ క్లినిక్ అధినేత డాక్టర్ పృథ్వీరాజ్, పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు, లంకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం అధ్యక్షులు చిన్నం మణీంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 520 మంది విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లయన్ బాపయ్య శర్మ, సెక్రటరీ త్రిమూర్తులు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పిరిట్ క్లబ్ ఆధ్వర్యంలో...

స్థానిక స్పిరిట్ క్లబ్ ఆధ్వర్యంలో గవర్నమెంట్ కళాశాలలో శుక్రవారం అధ్యక్షుడు పెదప్రోలు భాస్కర్ అధ్యక్షతన మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బత్తుల ప్రసాద్, వట్టిపోలు రాము, నూకల నాగ మల్లేశ్వరరావు, టి.పాండురంగారావు, ప్రిన్సిపాల్ వెంకటరమణ, నాగార్జున, రాజా త్రినాథ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాధవి

ఆరోగ్యం కాపాడుకోవాలి

విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, మానసిక, శారీరక ఆరోగ్యాలను కాపాడుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి విద్యార్థులకు సూచించారు. తాడేపల్లిగూడెం న్యాయ సేవా కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆదేశాల మేరకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఆదిత్య కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెంలో ప్రజాప్రతినిధుల అండతో రౌడీయిజం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల అండతో రౌడీయిజం రాజ్యమేలుతుందని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాను 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచామని, అయితే ఇన్నేళ్లకు రాజకీయ ప్రజాప్రతినిధుల అండతో రౌడీయిజం మరలా మేల్కొందన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరులు, షాడో ఎమ్మెల్యే తదితరుల ప్రోద్బలంతో నకిలీ మద్యం ఏరులై పారుతుందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ అమలు చేయలేకపోయినా బెల్టు షాపుల పథకం విజయవంతమైందని ఎద్దేవా చేశారు. మండలంలోని ఓ గ్రామంలో ప్రజాప్రతినిధికి చెందిన వైన్‌షాపు వద్ద మద్యం ధరలు పెరిగాయని, సహకరించాలని బోర్డులు పెట్టి మరీ ఎమ్మార్పీకి మించి దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ రాకెట్‌ను షాడో ఎమెల్యే నిర్వహిస్తున్నాడని బహిరంగంగానే చెబుతున్నారన్నారు. ఇదిలా ఉండగా ప్రజాప్రతినిధులు బహిరంగంగానే వారి అవినీతి చర్యలను వెల్లడించడంతో ప్రజలు అవాక్కవుతున్నారన్నారు. ప్రజాప్రతినిధి వెంట బ్రోకర్ వ్యవస్థ నడుస్తుందని వారే లంచాలు దండుకొని వారి కమీషన్ తీసుకొని మిగిలినది ప్రజాప్రతినిధికి అప్పగిస్తున్నారని ఆరోపించారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామని, ట్రాఫిక్ సమస్యకు బ్రిడ్జిని, మురుగునీరు సమస్య పరిష్కారానికి భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామన్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి నిర్మాణాల వివరాలను త్వరలో వెల్లడిస్తామని మాజీ మంత్రి కొట్టు చెప్పారు. నాయకులు కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, గుండుమోగుల సాంబయ్య, హుస్సేన్ బీబీ, కైగాల శ్రీనివాస్, బొద్దాని శ్రీనివాస్, చెన్నా జనార్దన్, జడ్డు హరిబాబు, ఆరమిల్లి రవి, పెంటపాటి సుబ్బారావు, గురజ వెంకటేశ్వరరావు, శోట్టిపల్లి సుబ్బారావు, రెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజలకు న్యాయం కోసమే కోటి సంతకాల సేకరణ

తాడేపల్లిగూడెం అర్బన్: కూటమి పాలనలో ప్రజలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు రచ్చబండ కార్యక్రమంతో పాటు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపడతామన్నారు. అక్టోబరు 28న నియోజకవర్గ కేంద్రాల్లో, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 23న నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు అందజేయడం, నవంబర్ 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించి అక్కడి నుంచి ఈ పత్రాలను గవర్నర్‌కు నివేదిస్తామని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. అనంతరం వైఎస్సార్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

- వైఎస్ జగన్ అలుపెరుగని పోరాటం
- పేద పిల్లలను వైద్యులుగా చూడాలన్నదే వైఎస్ జగన్ ఉద్దేశ్యం
- చంద్రబాబు తన వారికి కట్టబెట్టేందుకే ప్రైవేటీకరణ



పోస్టర్‌ను ఆవిష్కరించిన మురళీకృష్ణరాజు, పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: సామాన్యులు, పేదలకు వైద్య విద్య అందకూడదనే ఉద్దేశ్యంతో పాటు తన వారికి వైద్య కళాశాలలను కట్టబెట్టాలనే దురుద్దేశ్యంతోనే చంద్రబాబు వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు దిగుతున్నారని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 5 ఏళ్లలో 17 వైద్య కళాశాలలను తీసుకొచ్చి పేద విద్యార్థులను వైద్యులను చేయాలని కలలు కన్నారని కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటి పనులను నిలిపివేశారని విమర్శించారు. శుక్రవారం తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునే క్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాబోయే రోజుల్లో ప్రత్యేక కార్యాచరణ చేస్తారని అందులో భాగంగా కోటి సంతకాలను సేకరించి గవర్నర్‌కు అందించనున్నారన్నారు. తణుకులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు చెప్పారు.

నర్సీపట్నంలో జన సంద్రం

వైద్య కళాశాల లేదు. జీవో లేదంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలతో పాటు విసిరిన సవాల్‌ను స్వీకరించి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం వైద్య కళాశాల సందర్శించిన పర్యటనలో జనం సంద్రంలా వచ్చారు. వైఎస్ జగన్ వద్దకు జనాన్ని వెళ్లనీయకుండా ఎన్ని రకాలుగా పోలీసులు కుట్రలు చేసినా వాటన్నింటిని పటాపంచలు చేస్తూ ప్రజలు దారి పొడవునా నీరాజనాలు పట్టారన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు అబద్ధాలు, మోసపు మాటలను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయితీ రాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, పబ్లిసిటీవింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఝాన్సీ లారెన్స్, షేక్ ఫహీమా, లలిత, చింతలపూడి సూర్యనారాయణ, పైడి సాయిసూర్య, షేక్ జిలాని పాల్గొన్నారు.

కూటమి అజెండాలో రాని సమస్యలు



కమిటీ సమావేశంలో డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉద్యోగ, కార్మిక సమస్యలు కూటమి ప్రభుత్వం అజెండాలోకి రాకపోవడం విచారకరమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కడకట్లలో కమిటీ సమావేశం, ఓసూరి వీర్రాజు అధ్యక్షతన నిర్వహించారు. డి.సోమసుందర్ మాట్లాడుతూ పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు విజయవంతం చేయాలన్నారు. వివిధ సంఘాల్లో రాష్ట్ర స్థాయి నాయకత్వం బాధ్యతలు వహిస్తున్న 167 మంది సీనియర్ నాయకులు కౌన్సిల్ సమావేశాలకు తాడేపల్లిగూడెం తరలిరానున్నారని తెలిపారు. మండలపర్తి హరీష్, కళింగ లక్ష్మణరావు, కే.లక్ష్మీనారాయణ, తాడికొండ శ్రీనివాస్‌రావు, పోలిరాతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం: వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ నరసాపురంశాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం సచివాలయ ఉద్యోగులు నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లతో గతంలో చేయించిన పనులు ఇప్పుడు తమతో చేయిస్తున్నారని వాపోయారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, అవమానాలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇంటింటికీ తిరిగి చేసే పనులు అప్పగించడం మానాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్స్ వెంటనే ఇవ్వాలని, ఆరేళ్లు ఒకే కేడర్‌లో సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నరసాపురం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులసంఘ నాయకులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మల్లిన అరుణసారథి సౌజన్యంతో రాజమండ్రి జీఎస్ఎల్ క్యాన్సర్ ట్రస్ట్ హాస్పిటల్ బృందంచే శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీకే ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఈ శిబిరంలో జీఎస్ఎల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు వైద్య బృందంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ మొబైల్ వాహనాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, సీనియర్ వైద్యుడు తాతిన రామబ్రహ్మం, వైద్యులు ప్రసాద్, రవి, నిమ్మగడ్డ అచ్యుత రామయ్య, కె.సిద్ధార్థ, పోతుల శ్రీనివాస్, అక్కిన కాశీ విశ్వనాధం, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులతో మానవహారం

పెంటపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పెంటపాడు డిగ్రీ కళాశాల వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కార్యక్మరంలో ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, కామర్స్ విభాగాధిపతి ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు స్వీయ నిర్ణయం తీసుకోవాలి

పెనుగొండ: ప్రతి గర్భిణీ, బాలింత ఆరోగ్య సంరక్షణకు స్వీయ నిర్ణయం తీసుకునే సంకల్పంతో ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వాకా ప్రసాద్ అన్నారు. శుక్రవారం పోడూరు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఎన్టీఆర్ వైద్యసేవల నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: ఎన్టీఆర్ వైద్య సేవలందించే ఆసుపత్రులు శుక్రవారం తమ వైద్య సేవలను నిలుపుదల చేశారు. పట్టణంలో ఉన్న రెండు ఆసుపత్రుల్లో బయట »ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బతుకు భారమైంది నడక కష్టమైంది« 10 నుంచి వైద్య సేవలు బంద్ అంటూ నోటీసు బోర్డులు అంటించడంతో రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు. రూ.2700 కోట్లు బిల్లులు ఆగిపోతే తాము మాత్రం ఎంతని ఖర్చు చేయగలమని బిల్లులు రిలీజ్ చేస్తూ ఉంటే తమకు కూడా భారం తగ్గుతుందని ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ప్రభుత్వం కనీస హామీలు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 10 నుండి నెట్ వర్క్ వైద్య సేవలు నిలుపుదల చేస్తామని తాము ప్రభుత్వానికి ముందుగానే హెచ్చరించామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అన్నాభిషేకం



అయ్యప్పస్వామి ఆలయంలో అన్నాభిషేకంలో సుబ్రహ్మణ్యస్వామి

తణుకు అర్బన్: కృత్తిక నక్షత్ర పరవదినం సందర్భంగా శుక్రవారం తణుకు జాతీయ రహదారిని అనుకుని ఉన్న శ్రీధర్మశాస్తా పంచాయతన శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి అనంతరం అన్నాభిషేకాన్ని చక్కెర పొంగళిగా తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చలపతిరావు, భరణిస్వామి, రవిస్వామి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభయ గణపతికి పంచామృత అభిషేకాలు



అభయ గణపతి స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అభయ గణపతికి సంకష్టహర చవితి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలోని గణపతి స్వామికి పంచామృతాలతోను, పలు ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష పూజలు నిర్వహించారు. సహస్రనామార్చనలు, శ్వేతార్క పుష్పాలతో దుర్వాంకురాలతో అర్చనలు చేశారు. కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

జీఎస్టీపై సదస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు చేసి మధ్యతరగతి ప్రజలకు భరోసాగా నిలిచార ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.